పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య భద్రత

- ఇక నుంచి పూర్తిస్థాయిలో ఈఎస్ఐ అమలు
- ఏడాదికి రూ.2.5లక్షల వరకు ఉచితంగా వైద్యం
- జిల్లాలో 1250 మందికి మేలు



సుల్తానాబాద్‌లో శుభ్రం చేస్తున్న కార్మికులు (ఫైల్)

సుల్తానాబాద్: మున్సిపల్ కార్మికుల ఆరోగ్య భద్రతకు ఢోకా లేదు. ఇక నుంచి పూర్తిస్థాయిలో ఈఎస్ఐ(ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్) అమలుకానుంది. ఇందుకు ఇటీవల పురపాలకశాఖ ఆదేశాలు జారీ చేసింది. భవిష్యత్‌లో ఆరోగ్యపరంగా పెద్ద సమస్య ఏర్పడితే ఖర్చు లేకుండా వైద్యసేవలందనున్నాయి. గతంలో ఈఎస్ఐ, పీఎఫ్(ప్రావిడెడ్ ఫండ్) సౌకర్యం కల్పించినా వాటి చెల్లింపులు చేయకపోవడంతో సేవలు అందేవి కావు. రాష్ట్ర ప్రభుత్వం నెలకోసారి మున్సిపల్ కార్యాలయం ఎదుట సిబ్బందికి, కార్మికులకు వైద్యఆరోగ్య పరీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. ఉచిత మందులతో పాటు పలు రకాల పరీక్షలను స్థానిక వైద్యబృందం చేపడుతుంది. కొన్ని పురపాలికలు మూడు, నాలుగు నెలలకోసారి ఈఎస్ఐ రుసుం జమ చేసేవి. దీన్ని గుర్తించిన పురపాలకశాఖ ఇక నుంచి ప్రతినెలా కచ్చితంగా ఈఎస్ఐ చెల్లింపులు చేయాలని ఆదేశించిందని అధికారులు తెలిపారు.

1250 మందికి మేలు..

జిల్లాలో పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని పురపాలికలు, రామగుండం కార్పొరేషన్ ఉన్నాయి. అన్ని విభాగాల్లో కలిపి 1250 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరు అనారోగ్యానికి గురైతే పురపాలికల తీరుతో ఈఎస్ఐ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందలేని పరిస్థితి. కొన్ని పురపాలికల్లో బకాయిలు చెల్లించకపోవడంతో కార్డులున్నా నిరుపయోగంగా మారాయి. తాజా ఆదేశాలతో ఆ సమస్య తప్పింది. ప్రతి నెలా కార్మికులకు చెల్లించే వేతనాల్లో పీఎఫ్ వాటా 12శాతం, ఈఎస్ఐ వాటా 0.75 శాతం మినహాయించుకుంటారు. ఆ మొత్తాన్ని వేతనం పొందిన నెలలో 15వ తేదీలోపు సంబంధిత ఖాతాలకు జమ చేయనున్నారు. దీంతో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఏడాదికి రూ.2.5లక్షల వరకు ఉచితంగా వైద్యం పొందొచ్చు.

వైద్యం అందించడం మంచిదే



మున్సిపల్‌లో ఇప్పటికే నెలకు ఒకసారి స్థానిక వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యం శిబిరం నిర్వహించి రక్త పరీక్షలతోపాటు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. ఈఎస్ఐ సౌకర్యం కల్పించడం మంచిదే.

– ఆనంద్, కార్మికుడు, సుల్తానాబాద్

ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి



గ్రామ పంచాయతీల మాదిరిగా మున్సిపల్ కార్మికులకు మున్సిపల్ డబ్బులు చెల్లించి కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. కార్మికులకు భద్రత సౌకర్యం ఉన్నట్టు ఉంటుంది. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టిందని భావిస్తున్నాం.

– సురేశ్, మున్సిపల్ కార్మికుడు, సుల్తానాబాద్

క్లుప్తంగా

స్వచ్ఛత అందరి బాధ్యత



స్వచ్ఛత కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ బృందం

జ్యోతినగర్: స్వచ్ఛత మనందరి బాధ్యత అని రామగుండం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ త్రయంబకేశ్వర్ రావు అన్నారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని కేంద్రియ విద్యాలయంలో ఏక్ తారీక్ ఏక్ ఘంటా కార్యక్రమంలో భాగంగా సీఐఎస్ఎఫ్, కేంద్రియ విద్యాలయ సిబ్బంది చేపట్టిన స్వచ్ఛత దివస్‌లో పాల్గొన్నారు. సీనియర్ కమాండెంట్ ముఖేష్ కుమార్‌తో పాటు అలోక్ కుమార్ పాండే, శ్రీనివాసచారి, అనిల్ కుమార్, సతీశ్, రాఖీ కృష్ణన్, యాదవ్, కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపాల్ సర్దార్ భాషా, విద్యార్థులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, ఉపాధ్యాయ బృందంతో పాటు పలువురు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునీల్‌రెడ్డి

ముత్తారం: ముత్తారానికి చెందిన పలువురు మహిళలు ఆదివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు, మంథని ఇన్‌చార్జి చందుపట్ల సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు పెయ్యల కుమార్, జిల్లా అధికార ప్రతినిధి పోతరవేని క్రాంతి కుమార్, నాయకులు అమ్ము శ్రీనివాస్, దేవునూరి కొమురయ్య పాల్గొన్నారు.

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఊరేగింపు



ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

గోదావరిఖనిటౌన్: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా తన్‌జిమ్ అహ్లే సున్నత్ వల్ జమాత్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీనగర్‌లోని సురాని మదర్సా నుంచి కళ్యాణ్‌నగర్, రీగల్ షూమార్ట్ మీదుగా ప్రధాన చౌరస్తా వరకు ఊరేగింపు నిర్వహించారు. షేక్ హాజీ అలీ, మహ్మద్ షరీఫ్ సాహెబ్, షేక్ హాజీ అలీ, మహమ్మద్ రఫీక్, నజీమొద్దీన్, షేక్ అలీ, రియాజ్‌బేగ్, సయ్యద్ జానీ, ఖాసీం, హబీబ్ బేగ్, సర్వర్ హుస్సేన్, మౌలానా పాల్గొన్నారు.

పెంచిన వేతనాలు ఇచ్చేదాకా సమ్మె



మాట్లాడుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలు చెల్లించేదాకా సమ్మె కొనసాగుతుందని సంఘం నాయకుడు పూసాల రమేశ్ అన్నారు. ఆదివారం పెద్దపల్లిలో యూనియన్ నాయకులు, వర్కర్లు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. దసరా నుంచి విద్యార్థులకు అల్పాహారం అందించాలంటే వేతనాన్ని రూ.10వేలకు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు ప్రేమ పావని, రవీందర్, విజయలక్ష్మి, కుంటాల రాములు, దశరథం, సాయిలు ఉన్నారు.

సీసీరోడ్లతో కాలనీకి నూతన శోభ



పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సునీత

సుల్తానాబాద్: సీసీరోడ్ల నిర్మాణంతో కాలనీలకు నూతన శోభ సంతరించుకుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీతగౌడ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని స్వప్న కాలనీలో ఆదివారం రూ.6లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. రానున్న రోజుల్లో పట్టణంలో మరిన్ని సీసీరోడ్లు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ టి.మల్లికార్జున్, కౌన్సిలర్ దున్నపోతుల రాజయ్య, స్థానికులు పురుషోత్తంరావు, రాజయ్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి



కోల్‌సిటీ: రోడ్లను శుభ్రం చేస్తున్న సిబ్బంది



పెద్దపల్లిరూరల్: బీజేపీ ఆధ్వర్యంలో..



సుల్తానాబాద్‌రూరల్: ప్రతిజ్ఞలో పాల్గొన్న ఎంపీపీ

సుల్తానాబాద్: పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత కోరారు. ఆదివారం మున్సిపల్ పరిధిలో ఏక్ తారీక్ ఏక్ గంట ఏక్ సాత్ కార్యక్రమాన్ని కౌన్సిలర్లతో కలిసి నిర్వహించారు. శ్రమదానం చేపట్టి పిచ్చిమొక్కలు చెత్తచెదారం వ్యర్థ పదార్థాలను తొలగించారు. కాలనీలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ఆయా వార్డు కౌన్సిలర్ల ఆధ్వర్యంలో వార్డు ఆఫీసర్లు శ్రమదానం చేపట్టారు. కమిషనర్ టి.మల్లికార్జున్ వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్ పాల్గొన్నారు.

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ అధికారులు, గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) అధికారులు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం వేర్వేరుగా శ్రమదానం చేసి బల్దియా కార్యాలయం, ఆస్పత్రి ఆవరణ అంతా పరిశుభ్రం చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్ చీపురుతో ఊడ్చి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, అప్పారావు, తిరుమలేశ, అధికారులు రాజలింగం, శంకర్‌రావు, బీచుపల్లి తిరుపతి, పబ్బాల శ్రీనివాస్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ పాల్గొన్నారు.

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ మాతంగికాలనీలో ఆదివారం కార్పొరేటర్ జెట్టి జ్యోతి ఆధ్వర్యంలో చెత్తను తొలగించారు.

ధర్మారం: ధర్మారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పెరిగిన పిచ్చిమొక్కలను పతంజలి యోగా సమితి సభ్యులు తొలగించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చెత్తను అలియాన్స్ క్లబ్ ఆఫ్ ధర్మారం సభ్యులు తొలగించి శుభ్రం చేశారు.

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని సాంబయ్యపల్లి, రేగడిమద్దికుంట గ్రామాల్లో స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీపీ బాలాజీరావు, ఎంపీడీవో శశికళ, ఎంపీవో ఫయాజ్ అలీ, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని ఆయా గ్రామాల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఎలిగేడు: మండలంలో శ్రమదానం చేపట్టారు. జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం బీజేపీ నాయకులు శ్రమదానం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండలంలో పీహెచ్‌సీతో పాటు గ్రామాల్లో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు.

జూలపల్లి: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట శ్రమదానం చేశారు. ఎంపీపీ రమాదేవి, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.



రామగిరి: కల్వచర్లలో ర్యాలీ



ధర్మారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



ఫర్టిలైజర్‌సిటీ: స్వచ్ఛత కార్యక్రమంలో కార్పొరేటర్

అర్ధరాత్రి అరెస్టు చేయడం అప్రజాస్వామికం



పోలీస్‌స్టేషన్‌లో అఖిలపక్షం నాయకులు

కాల్వశ్రీరాంపూర్: 'అర్ధరాత్రి అరెస్టు చేయడం అప్రజాస్వామికం అని, మేమేం నేరం చేశామని పోలీసులు మమ్మల్ని అరెస్టు చేశారు' అని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్, వ్యవసాయ కార్మిక శాఖ జిల్లా అధ్యక్షుడు మంద రాజేందర్ ప్రశ్నించారు. పెద్దపల్లిలో మంత్రి కేటీఆర్ బహిరంగ సభ సందర్భంగా ముందస్తు జాగ్రత్త చర్యగా శనివారం రాత్రి కాల్వశ్రీరాంపూర్ పోలీసులు అఖిలపక్ష నాయకులను అదుపులోకి తీసుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాగమల్ల సురేశ్, మాజీ సర్పంచు మాదాసు సతీశ్, బీజేపీ జిల్లా నాయకులు చల్ల చంద్రమౌళి, కాంగ్రెస్ యూత్ నాయకుడు మేడి అశోక్‌గౌడ్, మాజీ ఉప సర్పంచు అల్లం దేవేందర్‌లు అరెస్టయిన వారిలో ఉన్నారు.

ప్రజా ఆశీర్వాదయాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కమాన్‌పూర్: ఈ నెల 4, 5 తేదీల్లో మండలంలో జెడ్పీచైర్మన్ పుట్ట మధు నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద యాత్రను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి కమ్యూనిటీ హాల్లో ఆదివారం మండలశాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం జూలపల్లి వద్ద ఏర్పాటు చేసే బస ఏర్పాట్లను పరిశీలించారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, బొల్లపల్లి శంకర్‌గౌడ్, గడప కృష్ణమూర్తి, గుర్రం లక్ష్మిమల్లు, బాద్రపు మల్లేశ్, రాసకొండ రవి పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిన నేతలు



సుల్తానాబాద్: చైర్‌పర్సన్ సునీత, నాయకులు



ఓదెల: సభకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు



కాల్వశ్రీరాంపూర్: సభకు తరలుతున్న కార్యకర్తలు

సుల్తానాబాద్/ఎలిగేడు/ఓదెల/జూలపల్లి/పాలకుర్తి/కాల్వశ్రీరాంపూర్: పెద్దపల్లిలో నిర్వహించిన మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఆదివారం తరలివెళ్లారు. ఆయా ప్రాంతాల నుంచి బస్సుల్లో తరలినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జ్యోతినగర్: పట్టణంలోని ఎన్టీపీసీ విశ్వభారతి హైస్కూల్‌లో 2004–05లో పదో తరగతి వరకు కలిసి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. 18ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వాళ్లకు పాఠాలు బోధించిన టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, పాఠశాల హెడ్‌మాస్టర్ బందారపు తిరుపతిగౌడ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్యకర్తలతోనే కాంగ్రెస్‌కు పూర్వ వైభవం



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్: కాంగ్రెస్‌కు పూర్వ వైభవం కార్యకర్తలతో సాధ్యమని మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ నాయకుడు సారయ్యగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరుగుతోందని పెద్దపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలంతా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ప్రజలతో మమేకం కావాలన్నాని సూచించారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుల్తానాబాద్: మున్సిపల్ పారిశుధ్య కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి కోరారు. ఆదివారం సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను, కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఈనెల 3 నుంచి సమ్మె చేయనున్నట్లు నోటీసులు జారీ చేశారని, విజయవంతం చేయాలని ఆయన కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సావనపల్లి వెంకటస్వామి, మున్సిపల్ అధ్యక్షుడు పెర్క శ్రావణ్‌కుమార్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి న్యాతరి రమేశ్, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

బీఎస్పీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న దాసరి ఉష

ఓదెల: పెద్దపల్లిలో బీఎస్పీ గెలుపుకోసం కార్యకర్తలు సైనికుడిలా పనిచేయాలని పార్టీ పెద్దపల్లి ఇన్‌చార్జి దాసరి ఉష పిలుపునిచ్చారు. ఓదెలలో ఆదివారం బీఎస్పీ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త బీఎస్పీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. బహుజనుల రాజ్యం కోసం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు తగిన గుణపాఠం తప్పదన్నారు. మండలంలోని రూపునారాయణపేట నుంచి ఆరెల్లి రాజు, మైలగాని శ్రీనివాస్, రాపర్తి హర్షిత్, తడిగొప్పుల రాము, ఆరెల్లి కృష్ణ, కలవేని కుమార్ బీఎస్పీలో చేరారు. మాజీ సర్పంచ్ జక్కుల వెంకటస్వామి, బీఎస్పీ జిల్లా మహిళా కన్వీనర్ పూరెల్ల స్వప్నగౌడ్, అధ్యక్షుడు పల్లె ప్రశాంత్, నాయకులు రాచర్ల నవీన్, కళ్యాణం మహేశ్, మాటూరి రవి, బండ నిఖిల్‌కుమార్, బీరం రవి పాల్గొన్నారు.

బీఎస్పీని గెలిపించండి

సుల్తానాబాద్: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు బీఎస్పీని గెలిపించాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. ఆదివారం పట్టణంలోని జవహర్‌నగర్, పూసాల రోడ్డులో మన ఊరు మన ఉష కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బీఎస్పీ అధికారంలోకి వస్తే విద్య, వైద్యం ఉచితంగా అందిస్తామన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్‌పటేల్, అసెంబ్లీ కోశాధికారి ఎండీ రియాజ్, అసెంబ్లీ మహిళా కన్వీనర్ కల్వల శోభ, సుల్తానాబాద్ మండల కోశాధికారి అల్లెపు చంద్రశేఖర్, పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు రామిల్ల శారద, స్థానికులు అల్లెపు శృతి, అనిల్ పాల్గొన్నారు.

ప్రతిపక్షాల ముందస్తు అరెస్ట్



రామగిరి: అరెస్ట్ అయిన కాంగ్రెస్ నాయకులు



కమాన్‌పూర్: పోలీసుల అదుపులో నాయకులు



సుల్తానాబాద్‌రూరల్: కాంగ్రెస్ నాయకులు

గోదావరిఖని/ముత్తారం/రామగిరి/కమాన్‌పూర్/సుల్తానాబాద్‌రూరల్/యైటింక్లయిన్‌కాలనీ/ఓదెల/పాలకుర్తి: జిల్లాలో ఆదివారం రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా పలువురు నాయకులను ఆదివారం అరెస్ట్ చేశారు. ఉదయం నుంచే పోలీసులు బృందాలుగా విడిపోయి కాంగ్రెస్, బీజేపీ, హెచ్ఎంఎస్, ఏఐటీయూసీ నాయకులను అదుపులోకి తీసుకుని పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా వారిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు. ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వృద్ధుల సంక్షేమానికి ప్రాధాన్యం



సత్కరిస్తున్న జిల్లా సంక్షేమశాఖ అధికారులు



సుల్తానాబాద్: సన్మానిస్తున్న తహసీల్దార్

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం వృద్ధుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా సంక్షేమశాఖ అధికారి రవూఫ్ ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా పలువురిని సత్కరించారు. ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వృద్ధుల సంరక్షణ చట్టాల గురించి వివరించారు. సభ్యులు జీవన్‌రాజు, రాజయ్య, రాజేశం, సుందరి, సత్తయ్య ఉన్నారు.

వృద్ధుల బాధ్యత మనదే

సుల్తానాబాద్: వృద్ధులను బరువు అనుకోకుండా బాధ్యతగా చూసుకోవాలని తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వృద్ధుల దినోత్సవం సందర్భంగా 80ఏళ్ల పైబడిన ఓటర్లను సన్మానించారు.



ఎలిగేడు: ధూళికట్టలో వృద్ధులకు సన్మానం

ఎలిగేడు: వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఎలిగేడు మండలంలోని ధూళికట్ట జీపీ కార్యాలయంలో సర్పంచ్ గొల్లె కావురి ఆధ్వర్యంలో వృద్ధులను ఘనంగా సన్మాంచారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గొల్లె భూమేశ్, వీవోఏలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అవయవదానంలో నంబర్ వన్



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

సుల్తానాబాద్: అవయవదానం చేసేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని, తద్వారా అవయవ దానం అంగీకారంలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ప్రమోద్‌కుమార్ తెలిపారు. పట్టణంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 10,823 మంది అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చారని, జిల్లాలో 397 అంగీకారం తెలుపుతూ పత్రాలు అందజేశారని తెలిపారు. అవయవదానం అంగీకారం కోసం 'ఆర్గాన్ డొనేషన్ రిజిస్ట్రీ యాప్'లో తమ పేరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు అవయవదానంపై ప్రతిజ్ఞ చేశారు.